క్లుప్తంగా

పీఏబీఆర్‌లో పెరిగిన అవుట్ ఫ్లో


పీఏబీఆర్ జలాశయంలో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం)లో నీటి మట్టం తగ్గుముఖం పడుతోంది. డ్యాంలోకి ఇన్‌ఫ్లో కంటే అవుట్ ఫ్లోనే ఎక్కువగా ఉంది. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా 460 క్యూసెక్కులు, హెచ్‌ఎన్‌ఎస్ ద్వారా 55 క్యూసెక్కుల నీరు వచ్చి డ్యాంలోకి చేరుతోంది. కుడి కాలువకు 595 క్యూసెక్కులు , అనంతపురం, సత్యసాయి, శ్రీరామిరెడ్డి, ఉరవకొండ, కూడేరు తాగునీటి ప్రాజెక్టులకు 55 క్యూసెక్కులు, లీకేజీ, ఆవిరి రూపంలో 40 క్యూసెక్కుల చొప్పున అవుట్ ఫ్లో ఉంది. ఆదివారం నాటికి డ్యాంలో 3.266 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం ఇరిగేషన్ జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

రాయదుర్గంటౌన్: ఓటర్ల జాబితా 2024–25 ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15 వరకు ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సుజాత తెలిపారు. 1 జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. మార్పులు, చేర్పులు, ప్రస్తుత ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలిపేందుకు సచివాలయాల్లోని బీఎల్‌ఓలు లేదా అన్‌లైన్, తహసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల విభాగంలో దరఖాస్తులు సమర్పించొచ్చన్నారు. సవరణల అనంతరం జనవరి 6న తుది ఓటరు జాబితాను జిల్లా అధికారులు ప్రకటించనున్నట్లు చెప్పారు. ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,64,009 మంది ఉండగా 1,30,558 మంది పురుష ఓటర్లు, 1,33,409 మహిళా ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

కణేకల్లులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ

కణేకల్లు: కణేకల్లులోని రైతుసేవా సహకార సంఘంలో వరికొనుగోలు కేంద్రాన్ని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి, ఆర్డీఓ వసంతబాబుతో కలిసి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ దళారులను నమ్మిమోసపోకుండా వరికొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని, రైతులకు 48 గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు జమవుతాయన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఫణికుమార్, ఏఓ శ్రవణ్ కుమార్, చెరువు సంఘం మాజీ అధ్యక్షుడు వేలూరు మరియప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడి మృతి

బొమ్మనహాళ్: కాలువపల్లి వద్ద గత నెల 24న ద్విచక్ర వాహనంలో వెళ్తూ ప్రమాదంలో గాయపడిన ముషీర్ (21) చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

మతపరమైన లెక్కల సేకరణ ఆపాలి

రాయదుర్గంటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో మతపరమైన లెక్కల సేకరణ ఆపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున కోరారు. ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీ పిల్లల లెక్కలను 2014–25 వరకు పుట్టిన వారి వివరాలు, కేంద్రాల్లో చేరిన వారి నిష్పత్తి తదితర వివరాలను సేకరించి 24 గంటల్లో పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడాన్ని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో ఖండించారు. గుట్టుచప్పుడుగా వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం


దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

వజ్రకరూరు: రాగులపాడులోని హంద్రీ నీవా ప్రధాన కాలువ వద్ద రైతులు వెంకటరెడ్డి, సుధాకర్ రెడ్డి, కురుబ నాగ రాజు, కురుబ వశికేరప్ప, కురుబ గంటా వశికేరప్పకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి, అందులోని వైరు, సామగ్రిని ఎత్తుకెళ్లారు. బాధిత రైతులు మాట్లాడుతూ హంద్రీనీవా ప్రధాన కాలువ కింద మిరప పంట సాగు చేశామని, ఐదురోజులకోసారి నీరందించాల్సి ఉంటుందన్నారు. ఆదివారం ఉదయం తాము వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం అయిన విషయాన్ని గుర్తించినట్లు తెలిపారు.

మూగజీవాలకు అందని వైద్యం

- ఆరు నెలల నుంచి పశువైద్యశాలల్లో మందుల్లేవ్
- వేధిస్తున్న పశు వైద్యుల కొరత
- శిథిలావస్థలో పశువైద్యశాలలు
- పట్టించుకోని కూటమి సర్కారు


రాయదుర్గంలోని పశువైద్యశాలలో మేక ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న పశువైద్యుడు అనీల్

రాయదుర్గంటౌన్: మూగజీవాలే కదా బతికినా..చచ్చినా ప్రశ్నించేవారెవరు అనే రీతిలో చంద్రబాబు కూటమి సర్కారు వ్యవహరిస్తోంది. ప్రజలతోపాటు మూగజీవాలకు కూడా వైద్యం సక్రమంగా అందడంలేదు. సకాలంలో వైద్యం అందించేందుకు కనీస మందులు కూడా అందుబాటులో లేవు. పశువైద్యశాలల్లో దాదాపు ఆరు నెలల నుంచి ఈ పరిస్థితి నెలకొంది. గతంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలు, పశు సంచార వాహనాల ద్వారా మూగజీవాలకు అవసరమైన వైద్యాన్ని సకాలంలో అందించేవారు. ప్రస్తుతం కూటమి సర్కారు మాత్రం పశు సంచార వాహనాలపై ఉన్న వైఎస్సార్ ఫొటో, పేర్లను తొలగించడంపై పెట్టిన శ్రద్ధ.. మూగజీవాలకు వైద్యం అందించడంపైనా, వాటి సంరక్షణపైనా దృష్టి సారించలేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గంలోని పశు వైద్య కేంద్రాలకు కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటికీ మందులు సరఫరా కాలేదు. గత ఏప్రిల్ నెలలో సరఫరా జరగ్గా, ఇప్పటి దాకా అతీగతీ లేదు. రాయదుర్గం నియోజకవర్గంలోని రాయదుర్గం, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, కణేకల్లు మండలాల్లో పాడి ఆవులు, ఎద్దులు కలిపి 71,594 ఉన్నాయి. గొర్రెలు 1,73,409, మేకలు 56,110 ఉన్నాయి. ప్రతి పశువైద్యశాలకు మూడు నెలలకోసారి రూ.70 నుంచి రూ.లక్ష దాకా మందులు అవసరమవుతాయి. అత్యవసర చికిత్స నిమిత్తం ఉపయోగించే యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్, బాగా మేత మేయడానికి వాడే మందులు, కాల్షియం, ఎముకల పొడి వంటి దాదాపు 200 రకాలకుపైగా మందులను ప్రభుత్వం వైద్యశాలలకు నేటి వరకు సరఫరా జరగలేదు. అందుబాటులో ఉన్న అరకొర మందులతో నెట్టుకొస్తున్నారు. మిగతా అన్నింటినీ బయట మెడికల్ షాపుల్లో యజమానులే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మందుల కోసం ఇండెంట్ పెట్టేందుకు జిల్లా స్థాయిలో ఓ కమిటీ ఉండేది. పశు వైద్యశాలల్లో విధులు నిర్వహించే వైద్యులు, ఏడీఏలు ఇలా ఎవరికి వారు తమ పరిధిలోనే ఆన్‌లైన్‌లో పశువులకు, మూగ జీవితాలకు ఎలాంటి మందులు కావాలో ఇండెంట్ పెట్టుకునే అవకాశం ఉండేది. ప్రతి మూడు నెలలకోసారి కచ్చితంగా మందులను పశువైద్యశాలలు, రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. వైద్యులు మందుల కోసం ప్రతిపాదనలు పంపి ఆరు నెలలు గడిచిపోతున్నా నేటి వరకూ సరఫరా కాని పరిస్థితి ఉంది.

శిథిలావస్థలో భవనాలు.. పశువైద్యులూ లేరు..

నియోజకవర్గంలోని రాయదుర్గంలో మూడు పశువైద్యశాలలు, గుమ్మఘట్ట మండలంలో రెండు పశువైద్యశాలలు, రెండు సబ్‌సెంటర్లు, కణేకల్లు మండలంలో రెండు పశువైద్యశాలలు, ఒక సబ్‌సెంటర్, బొమ్మనహాళ్ మండలంలో రెండు పశువైద్యశాలలు, డి.హీరేహాళ్ మండలంలో రెండు పశువైద్యశాలలు, ఒక సబ్ సెంటర్ ఉంది. మొత్తం 11 పశువైద్యశాలల్లో కేవలం నలుగురు మాత్రమే రెగ్యులర్‌గా పని చేస్తుండగా, మిగతా చోట్ల అన్నింట్లోనూ వీరే అదనపు బాధ్యతలు చూడాల్సిన వస్తోంది. వైద్యుల కొరతతో కాపౌండర్లే వైద్య చికిత్సలు చేయాల్సి వస్తోంది. మరోవైపు దాదాపు అన్ని పశువైద్యశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పట్టణంలోని పశువైద్యశాలలోని భవనాలు పైకప్పు పెచ్చులు ఊడి ప్రమాదకరంగా ఉంది. విధులు నిర్వర్తించేందుకు వైద్యుడు, సిబ్బంది జంకుతున్నారు. గుమ్మఘట్ట మండలం నేత్రపల్లి గ్రామంలోని పశువైద్య కేంద్రం పూర్తిగా శిథిలమైన వినియోగంలో లేదు.

బయట షాపుల్లో కొనాల్సి వస్తోంది



జీవాలకు ఏదైనా అత్యవసర మందులు అవసరం అయితే బయట మెడికల్ షాపుల్లో కుంటున్నాం. స్థానిక పశు వైద్య ఆస్పత్రిలో మందులు అందుబాటులో లేవు. చిన్న పాటి ప్రథమ చికిత్సలయితే అందుబాటులో ఉన్న మందులను ఇస్తున్నారు. అత్యవసరమైన మందులు లేవు. దీంతో మూగజీవాలను కాపాడుకునేందుకు తప్పనిసరిగా బయట మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసి చికిత్సలు చేయించుకుంటున్నాం.

– జయలక్ష్మి, మేకల యజమాని, రాయదుర్గం

ప్రతిపాదనలు పంపాం



మందులు కోసం ఇది వరకే ప్రతిపాదనలు పంపాం. వారంరోజుల్లోపు పశువైద్య కేంద్రాలకు మందులు సరఫరా చేయనున్నట్లు జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు. కొరత కారణంగా యజమానులు కొన్ని బయట కొనాల్సి వస్తోంది. మరోవైపు నేత్రపల్లి పశువైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో సేవలు అందించడం లేదు. వైద్యుల కొరత కారణంగా గుమ్మఘట్టతో పాటు సబ్‌సెంటర్లు, అర్బన్‌లో ఉన్న వైద్యులే ఇన్‌చార్జ్‌లుగా మిగతా చోట్ల సేవలందిస్తున్నాం.

– నవీన్, పశువైద్యుడు, గుమ్మఘట్ట మండలం


రాయదుర్గంలోని పశువైద్యశాల


పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన భవనం

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- త్వరలో అన్ని విభాగాలకు నూతన కమిటీల ఏర్పాటు
- మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి



రాయదుర్గం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీలోని 25 అనుబంధ సంఘాలకు నూతన కమిటీల ఎంపిక కోసం ఆయా మండలాలకు చెందిన నాయకులతో సమావేశాలు నిర్వహించి, అభిప్రాయాలు సేకరించారు. ఆదివారం విడివిడిగా పిలిపించి ఆయా మండలాల్లోని పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పదవుల పంపకాలపై కసరత్తు పూర్తి చేశారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 13 నుంచి ప్రజా పర్యటనకు సిద్ధమయ్యారన్నారు. రైతు సమస్యలపై ఈ నెల 13న జిల్లా కేంద్రంలో నిర్వహించే ర్యాలీలో నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లి భాగస్వాములు కావాలన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో పెద్ద ఎత్తున వ్యతిరేకత మొదలైందన్నారు. సూపర్‌సిక్స్ హామీలు నమ్మి ఓట్లేసిన ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అయ్యి ఉంటే ఈ పాటికే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అంది ఉండేవని గుర్తు చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమాయత్తం కావాలని, గ్రామ స్థాయి నుంచి పార్టీ కేడర్ నడుం బిగించాల్సి ఉంటుందన్నారు. పార్టీలోనే ఉంటూ కోవర్టులుగా పనిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కూటమిలోని కొందరు తమపట్ల చూపుతున్న అత్యుత్సాహం ప్రజలు గమనిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో సాగే అక్రమ ఇసుక, మట్టి రవాణాపై అధికారులు ఎందుకు అడ్డుకట్టు వేయలేకపోతున్నారన్నారు. నూతన కమిటీల ఎంపిక పూర్తయ్యాక వారి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

శుభకార్యం


నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి


వివాహవేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తదితరులు

వజ్రకరూరు: ఛాయాపురం గ్రామానికి వైఎస్సార్ సీపీ నాయకుడు దరూరు రమేష్, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె శ్వేత, అనంతపురం మండలం కాటిగానికాల్వకు చెందిన గోనుగుంట్ల సత్యనారాయణమ్మ, కేశవనాయుడు దంపతుల కుమారుడు వంశీకృష్ణ వివాహం ఆదివారం జరిగింది. ఉరవకొండలోని శ్రీసత్యం కన్వెషన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తది త రులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి


బహుమతులు అందిస్తున్న గురుసేవానంద స్వామి తదితరులు

వజ్రకరూరు: విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని వక్తలు సూచించారు. ఆదివారం స్థానిక టీటీడీ కళ్యాణ మంటపంలో గీతా జయంతిని పురస్కరించుకుని కమలపాడు శాంతనంద ఆశ్రమ నిర్వాహకుడు గురుసేవానందస్వామి ఆధ్వర్యంలో మండల స్థాయిలో భగవద్గీత 12వ కంఠస్థ అధ్యాయంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు భగవద్గీత 12వ కంఠస్థ పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. కార్యక్రమంలో కమలపాడు శాంతనంద ఆశ్రమ నిర్వాహకుడు గురుసేవానందస్వా మి, గ్రామపెద్దలు గోపాల్‌రెడ్డి, న్యాయనిర్ణేత నాగశయనం, ఆధ్యాత్మిక వేత్తలు రామాంజనేయులు, రమేష్, మల్లికార్జున , సత్యసాయి భక్తమండలి సభ్యుడు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన మలుపులు


పూలకుంట నుంచి రంగసముద్రంకు వెళ్లే రహదారిలో పెరిగిన కంపచెట్లు

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట నుంచి రంగసముద్రం గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డుకిరువైపులా కంపచెట్లు పెరిగిపోయాయి. ఈ మలుపుల వద్ద ద్విచక్రవాహనాలు,వాహనాలు ఎదురెదురుగా వచ్చినా కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈనెల 1నమహారాష్ట్రకు చెందిన మోహన్‌పవర్ దగడ, దిలీప్ పవర్‌లు పూలకుంట గ్రామానికి చెందిన శివలింగ అతని కుమారుడు హేమంత్ ద్విచక్రవాహనాలపై వెళ్తూ పరస్పరం ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మోహన్‌పవర్ దగడ అక్కడికక్కడే మృతిచెందాడు. ఇదే మార్గంలో మరో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు గాయాలపాలయ్యారు. మలుపులు వద్ద కంప చెట్లు పెరిగిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు చెప్తున్నారు. దీనిపై పంచాయతీరాజ్ డీఈఈ సుధాకర్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లగా రోడ్డుపక్కన ఉన్న కంపచెట్లను తొలగించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.


1986-87 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

కుందుర్పి: కళ్యాణదుర్గం, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాలకు చెందిన 1986–87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కుందుర్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 48 మంది విద్యార్థులు పదో తరగతి చదువుకున్నారు. కుందుర్పికి చెందిన టీచర్ రాధాకృష్ణ, హిందీ టీచర్ మూర్తి, ఏజెంట్ సోము, రమేష్, శీనా, డిష్ రామాంజి తదితరులు స్నేహితుల వివరాలు సేకరించారు. అందరికీ సమాచారం అందించి, సమ్మేళనానికి ఆహ్వానించారు. వీరంతా ఆటపాటలతో సందడి చేశారు. నాటి గురువులను సత్కరించారు. అంతకుముందు దివంగత గురువుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు


రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న గంజికుంటకు వెళ్లే ప్రధాన రహదారి

వజ్రకరూరు: మండల కేంద్రం నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లు కంకర తేలి అధ్వానంగా ఉన్నాయి. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వజ్రకరూరు నుంచి గంజికుంట, తట్రకల్లు, పందికుంట, ఎస్‌ఎస్‌పీతండా, వెంకటాంపల్లి, వెంకటా ంపల్లి పెద్ద తండా, జరుట్ల రాంపురం తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి దెబ్బతిని రాళ్లు తేలాయి. రహదారి దెబ్బతినడంతో రాకపోకలకు వాహనదారులు, ప్రజలు నానా పాట్లు పడుతున్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం ఎదురుగా నివాసం ఉంటున్న మేస్త్రీ అబ్దుల్ కలాం భార్య మెహబూబీ ఆరు రోజులుగా కనిపించలేదు. ఇంట్లో ఆర్థిక సమస్యలతోపాటు భర్తతో గొడవల కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదని బంధువులు స్థానిక పోలీసులకు మెహబూబీ బంధువులు ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి జాతర

బ్రహ్మసముద్రం: సూగేపల్లి గ్రామంలో వెలసిన పురాతన అరుడా చన్నమల్లప్ప సోమవారం ప్రారంభం కానుంది. చెన్నమల్లప్ప స్వామి మఠంలో శివలింగానికి రుద్రాభిషేకం, బిల్వార్చన విశేష పూజల అనంతరం స్వామి దర్శనం, మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం కార్తీక దీపోత్సవం ఉంటుంది. అనంతరం గద్దిగే పూజ జరుగుతుంది. అర్ధరాత్రి 12.30 గంటలకు ఆలయ 11వ మఠాధిపతి చన్నమల్లప్ప స్వామి అశ్వరథంపై ఊరేగింపు ఉంటుంది.

దశభుజ మహా గణపతికి ప్రత్యేక పూజలు


దశభుజ మహా గణపతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహా గణపతికి ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనానికి స్థానిక భక్తులే కాకుండా కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి, మొక్కులు తీర్చుకున్నారు.

నీలగిరిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


వజ్రకరూరులో అలంకరణలో నీలగిరిస్వామి

వజ్రకరూరు: స్థానిక కురుబవీధిలోని నీలగిరిస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆకుపూజ, మహామంగళ హారతి, తీర్థప్ర సాదవినియోగం, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ తదితర పూజలు నిర్వహించారు.

చిరుధాన్యాలతో వంటల తయారీపై శిక్షణ

కుందుర్పి: స్థానిక కుసుమగిరి రైతు సంఘం సౌజన్యంతో సంఘం కార్యాలయంలో చిరుధాన్యాలతో వంటల తయారీ, వివిధ రకాల నూనెల తయారీపై శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ సీఈఓ నరసింహమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ హైదారాబాద్‌కు చెందిన వంటమాస్టర్లతో వంటల తయారీపై శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే రూ.25వేలు వేతనం అందేలా చేస్తున్నట్లు తెలిపారు. మొదటగా 25 మందికి శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు.

10 నుంచి దర్గాహొన్నూరు స్వామి ఉరుసు

వజ్రకరూరు: మండలంలోని చాబాలలో దర్గాహొన్నూరుస్వామి ఉరుసు ఈనెల 10 నుంచి జరుగుతుందని దర్గా కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం రాత్రి కరె నాగప్ప ఇంటి నుంచి గంధం ఊరేగింపుతో దర్గాకు చేరుతుంది. 11న ఉరుసు జరగనుంది. రాత్రి గ్రామంలో కొమ్మే కుళ్లాయప్ప ఇంటి నుంచి షంషీర్ దర్గా చేరుతుంది. అనంతరం అన్నదానం ఉంటుంది.

మూగజీవాల మృత్యువాత


మృత్యువాత పడిన మూగజీవాలు

కంబదూరు: మండలంలోని ఓబగానిపల్లి గ్రామానికి చెందిన కురుబ అంజయ్యకు చెందిన జీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఆంజయ్యకు 78 మేకపోతులు, పొట్టేళ్ల పిల్లలున్నాయి. మూడు రోజులుగా 15 మూగజీవాలు చనిపోయాయని, దీంతో రూ.90 వేలు నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన చెందాడు. రోగాలతో జీవాలు మృతి చెందుతున్నాయా? లేక చేతబడి చేస్తున్నారా? అని బాధితుడు ఆందోళన చెందుతున్నాడు.

హంద్రీనీవా పనులు పూర్తి చేసి నీరందించండి

ఉరవకొండ: హంద్రీనీవా ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి జిల్లా రైతాంగానికి ప్రతి ఎకరానికీ సాగునీరు అందించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వై. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకొచ్చిన వెంటనే 10వేల క్యూసెక్కుల నీటిని తీసుకువచ్చేలా హంద్రీనీవా కాలువ వెడల్పు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ప్రస్తుతం లైనింగ్ పనులు చేస్తున్నట్లు చెప్పడం సరికాదని, ఆ పనులను తాము అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపిందని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని విరమించుకోవాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ఆందోళనలు చేస్తామని తెలిపారు.